# లక్ష్యాలను పూర్తిచేయని అధికారులపై చర్యలు

**- ఇంజనీరింగ్ శాఖల అధికారులు నిర్మాణ పనులు ఈనెలాఖరు లోగా పూర్తిచేయాలి**
**- బిల్లులు మార్చ్,15వ తేదీలోగా అప్లోడ్ చేయాలిలి**
**- ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖకు నిర్దేశించిన అంగన్వాడీ టాయిలెట్స్ నిర్మాణాలు నెలాఖరులోగా పూర్తి చేయాలి**
**- ప్రగతి చూపించని అధికారులను ఉపేక్షించేది లేదు**
**- ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు పనితీరుపై జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆగ్రహం**
**- ఇంజనీరింగ్ శాఖల నిర్మాణ పనుల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్




విధులపట్ల నిర్లక్ష్యంతో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయని అధికారులను ఉపేక్షించేదిలేదని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను హెచ్చరించారు. జిల్లాలో పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, ఆర్ డబ్ల్యూ ఎస్, సమగ్ర శిక్ష, హౌసింగ్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, తదితర ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన నిర్మాణ పనుల ప్రగతిపై గురువారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ 45 అంగన్వాడీ కేంద్రాలలో ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖ ద్వారా టాయిలెట్లు, పనులు, 108 త్రాగునీటి సరఫరా పనులు నిర్దేశించగా, ఇంకా 22 టాయిలెట్లు, 44 త్రాగునీటి సరఫరా పనులు, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం, అంబేద్కర్ గురుకులాలకు మంజూరైన 49 కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ లు నిర్మాణం కేటాయించగా ఇంకా 16 పనులు ప్రారంభించకపోవడంపై ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు పనితీరును మెరుగుపరచుకోకపోతే శాఖాపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని కలెక్టర్ హెచ్చరించారు. ఇంజనీరింగ్ శాఖల అధికారులు వారికి నిర్దేశించిన పనులు ఈనెలాఖరులోగా పూర్తిచేసి, మార్చి 15వ తేదీలోగా బిల్లులను అప్లోడ్ చేయాలనీ ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, త్రాగునీరు సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా సురక్షిత త్రాగునీటి ఆర్.ఓ. ప్లాంట్లు, టాయిలెట్లు ఉండాలని, వాటికి నీటి సరఫరా సౌకర్యం ఉండాలన్నారు. సంక్షేమ వసతి గృహాలకు దోమల నిర్మూలనకు దోమ తెరలు ఏర్పాటుచేయాలన్నారు. పనుల పురోగతిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించాలన్నారు. ఐటిడిఏ పీడీ రాములు నాయక్, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్, ఇరిగేషన్ ఎస్ఈ లు జెడ్. రమేష్, త్రినాధ్ బాబు, దేవప్రకాష్ ఐసిడిఎస్ పీడీ శారద, హౌసింగ్ అధికారి సత్యనారాయణ, సంబంధిత శాఖల డివిజినల్, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంబటికి ఘనస్వాగతం పలికిన వైసీపీ నేతలు

గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్,బి.ప్రభాకర్



రాజమండ్రి జైలు నుంచి విడుదలైన మార్గమధ్యలో అంబటి రాంబాబుకు భారీ జనసందోహంతో వైసీపీ నేతలు ఘన స్వాగతం పలికారు.
ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, కొవ్వూరు నియోజకవర్గ సమన్వయకర్త తలారి వెంకట్రావు పాల్గొన్నారు.వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని జై అంబటి, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు మండలం పోనసానిపల్లి మార్గమధ్యలో మాజీ హోం మంత్రి తానేటి వనిత అంబటి రాంబాబుకు గోపాలపురం నియోజకవర్గ నేతలతో ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు బొండాడ వెంకన్న బాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్ వైఎస్ఆర్సిపి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# రైస్ మిల్లుకు వెళ్తున్న రేషన్ బియ్యం లారీ

**- రూ.10.8 లక్షల విలువైన 30 టన్నుల బియ్యం పట్టివేత**

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్



రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న సమాచారం రావడంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద ఎస్సై జి నరేష్ పట్టుకున్నారు. 30 టన్నుల బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారు. వాటిని పట్టుకుని ఆరా తీయగా రేషన్ బియ్యంగా వెల్లడయింది.విజయవాడ సమీపం నుంచి ఈబియ్యాన్ని తీసుకొస్తున్నారు.ఈ బియ్యం విలువ సుమారు రూ. 10.8 లక్షలు ఉంటుంది. దీనిపై ఎస్ఐ నరేష్ బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ డ్రైవర్ ఆకుల శివకృష్ణ మణికంఠ ను అరెస్టు చేశారు.కాకినాడకు చెందిన కె.చంద్రశేఖర్‌కు చెందిన లారీ గా గుర్తించారు. అయితే ఈ బియ్యం కాకినాడ వెళుతున్నట్లు వారు చెబుతున్నారు. కాని కోస్తా జిల్లాలోనే రేషన్ బియ్యం కొనుగోలు కేంద్రంగా ఉన్న ఆలమూరు మండలం మోదుకూరు రైస్ మిల్లులకు ఈ బియ్యం వస్తున్నట్లు సమాచారం.ఈ బియ్యాన్ని మండపేట మండలం వేములపల్లి గౌడౌన్ లో దిగుమతి చేసి లారీని ఆలమూరు పోలీసు స్టేషన్ కు తరలిస్తామని మండల సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

# శాసనసభ పర్యటనకు నూజివీడు విద్యార్థులు

**- నూజివీడు విద్యార్థులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి పార్థసారథి**
**- విద్యార్థుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న పార్థసారథి , సవితమ్మ**
**- విద్య, క్రీడల్లో బాగా రాణించాలని సూచించిన మంత్రులు.**
**- పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపితే ఆర్థికసాయం చేస్తానని మంత్రి పార్థసారథి హామీ.**
**- ఐఐటీ ర్యాంకులు సాధించిన వారికి పెద్దమొత్తంలో ఆర్థికసాయం ఇస్తానని భరోసా**
**- హర్షం వ్యక్తం చేసిన నూజివీడు నియోజకవర్గ విద్యార్థులు.**

గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్,బి.ప్రభాకర్



ఏపీ శాసనసభ వ్యవహారాలను పరిశీలించి, అవగాహన పొందేందుకు రాష్ట్ర శాసనసభ ఇచ్చిన అవకాశం మేరకు గురువారం ఉదయం నూజివీడు నియోజకవర్గం నుండి 40మంది విద్యార్థులు శాసనసభ పర్యటనకు వచ్చారు. శాసనసభ వ్యవహారాలను వీఐపీ గ్యాలరీలో ఉండి పరిశీలించిన విద్యార్థులు బయటకు వచ్చిన అనంతరం వారితో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార,పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి,రాష్ట్ర బీసీసంక్షేమశాఖ మంత్రి సవితమ్మ సరదాగా ముచ్చటించారు...
విద్యార్థులతో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.....విద్యార్థి దశలోనే రాష్ట్ర శాసనవ్యవస్థపై అవగాహన పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ఈ అవకాశాన్ని మన రాష్ట్ర విద్యార్థులకు అందిస్తోంది. రాష్ట్ర సంక్షేమం కోసం ప్రభుత్వం చట్టాలు ఎలా చేస్తుంది? ప్రజా సమస్యల మీద శాసనసభలో ఎలాంటి చర్చలు చేస్తుంది? ప్రజల హక్కులు, చట్టాలపై ఎలాంటి చర్చలు జరుగుతాయి? అనే ప్రతి అంశాన్ని విద్యార్థులు గమనించి, అవగాహన పొందాలనేది దీని ఉద్దేశం. విద్యార్థి దశలో వీటిపై అవగాహన కలిగి ఉంటే...భవిష్యత్తులో ఆసక్తి ఉన్నవారు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవ మరింత ఉత్తమంగా చేయడానికి ఉపయోగపడుతుంది. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలంటే ఇది ఒక మంచి ప్రయత్నం అని సూచించారు.

### పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటితే ప్రోత్సాహకాలు :

నూజివీడు నియోజకవర్గంలో 10వ తరగతి చదివే విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటితే వారిలో మొదటి ఐదుగురికి కొలుసు పెదరెడ్డయ్య చారిటబుల్ ట్రస్టు నుండి ఆర్థికసాయం అందిస్తామని, పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ.25వేలు, రెండవ స్థానంలో నిలిస్తే రూ.15వేలు, మూడవ స్థానంలో నిలిస్తే రూ.10వేలు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5వేలు చొప్పున ఆర్థికసాయం అందిస్తామని మంత్రి పార్థసారథి విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా ఐఐటీ ర్యాంకులు సాధిస్తే పెద్దమొత్తంలో ఆర్థికసాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఐఐటీ ర్యాంకులు సాధించిన ఎస్టీ విద్యార్థులకు లక్ష రూపాయలు, ఎస్సీ విద్యార్థులకు రూ.75వేలు, బీసీ విద్యార్థులకు రూ.50వేలు, ఓసీ విద్యార్థులకు రూ.25వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. పదోతరగతి విద్యార్థులు వీటిని దృష్టిలో పెట్టుకుని బాగా చదవాలని కోరారు.

### 3నెలలు నారా లోకేష్ విద్యామృతం :

నూజివీడు నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు 3నెలల ముందు నుండి కొలుసు పెదరెడ్డయ్య చారిటబుల్ ట్రస్టు నుండి ప్రతిరోజు సాయంత్రం పాఠశాలల్లో "నారా లోకేష్ విద్యామృతం" పేరుతో పౌష్టికాహారాన్ని స్నాక్స్ రూపంలో అందిస్తాం. బాగా కష్టపడి చదివే విద్యార్థులకు మరింత శక్తి ఉండాలనే సదుద్దేశంతో నా సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాను. ప్రతి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి, విద్యలో రాణించాలి అని మంత్రి పార్థసారథి విద్యార్థులకు సూచించారు.

### విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి - మంత్రి సవితమ్మ ..

శాసనసభకు వెళ్లిన నూజివీడు విద్యార్థులతో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ సరదాగా కాసేపు ముచ్చటించారు. ఎలా చదువుతున్నారని విద్యార్థులను మంత్రి సవితమ్మ అడిగారు. బాగా చదువుతున్నాం అని చెప్పిన విద్యార్థులతో సవితమ్మ మాట్లాడుతూ.....విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులంతా బాగా రాణించాలని సూచించారు. క్రీడారంగంలోనూ భవిష్యత్తులో చాలా మంచి అవకాశాలు వస్తాయని, వాటిని కూడా అందిపుచ్చుకోవాలని సూచించారు. ఏ సబ్జెక్టు మీద బాగా మక్కువ ఉందో...ఆ సబ్జెక్టుపై బాగా శ్రద్ధ పెట్టి చదవాలని...భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు వెళ్లాలని కోరారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని సూచించారు. తదనంతరం విద్యార్థులతో మంత్రులు పార్థసారథి, సవితమ్మ ఫోటోలు దిగారు.

# ఐడీ కార్డుల ఆన్లైన్ ప్రక్రియ పై తెల్లం రాజ్యలక్ష్మి సమీక్ష

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంచార్జ్ బి ప్రభాకర్



వైసీపీ నాయకులు, కార్యకర్తలకు సంబంధించిన ఐడీ కార్డుల ఆన్లైన్ ప్రక్రియపై ఆ పార్టీ పోలవరం నియోజకవర్గం నాయకురాలు తెల్లం రాజ్యలక్ష్మి సమీక్ష నిర్వహించారు.గురువారం కుక్కునూరు మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని తెల్లం రాజ్యలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ ఐడి కార్డుల ఆన్లైన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు, సలహాలు చేశారు. పార్టీ కార్యకర్తలు డిజిటల్ విధానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆమె సూచించారు.ఈ సమీక్ష లో పార్టీ మండల ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు రాయి సత్యనారాయణ, శ్రీనివాసరావు,వింజరం ఉపసర్పంచ్ బరపటి వెంకటేశ్వర్లు,గంజి వెంకట్రావు,దడిగల సాంబశివరావు,నిమ్మల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**- ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్**
**- రాష్ట్రంలో ప్రతి 3వ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలతో మంచి ఫలితాలు.**
**-పర్యావరణ పరిరక్షణకు, పరిశుభ్రత కార్యక్రమాలకు మరింత బలాన్ని చేకూర్చే దిశగా ఎలక్ట్రికల్ ఆటోల పంపిణీ**

గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్,బి.ప్రభాకర్



గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అవుతుందని ఏపి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం ఏపి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా జిల్లాలో తొలివిడతగా నియోజకవర్గానికి ఒక్కొక్క ఆటో చొప్పున 7 గ్రామ పంచాయతీలకు ఏపి స్వచ్ఛ ఆంధ్రకార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ జెండాను ఊపగా, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి రిబ్బన్ కట్ చేసి ఎలక్ట్రికల్ ఆటోలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దుటకు, పరిశుభ్రంగా మార్చటం కోసం రాష్ట్రంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఒక ఉద్యమంగా ముందుకుతీసుకు వెళుతున్నామని అన్నారు.ఈ పంపిణీలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు

# శ్రీకాళహస్తిలో ఘనంగా చత్రపతి శివాజీ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి గాయత్రి వార్తలు ఫిబ్రవరి 19: రిపోర్టర్ : మునిరత్నం



ఛత్రపతి శివాజీ మహారాజ్ 396 వ జయంతిని పురస్కరించుకొని శ్రీకాళహస్తి ఛత్రపతి శివాజీ జంక్షన్ నందు భారత్ ఆర్గనైజేషన్ ఆఫ్ సోషల్ సర్వీస్ (బి.ఎ.ఎస్.ఎస్ ) వ్యవస్థాపకులు శ్రీపురం సుధాకర్ ఆధ్వర్యంలో మరాఠి వారు మరియు ఆర్. ఎస్. ఎస్, హిందూ చైతన్య వేదిక, ఛత్రపతి శివాజీ మహారాజ్ అభిమానులుచే జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కు విచ్చేసిన మంగి రెడ్డి ప్రబంధకారిని సరస్వతి శిశు మందిర్, సుబ్రహ్మణ్యం రెడ్డి శ్రీకాళహస్తి కండ కార్యవాహ ఆర్ఎస్ఎస్, సురేష్ ఖండకారికారిణి, సుమన్ ఖండ కార్యదర్శి, ప్రసాద్ కోశాధికారి భారత్ ఆర్గనైజషన్ ఆఫ్ సోషల్ సర్వీస్, కృష్ణ రెడ్డి, పసుపులేటి నవీన్, సతీష్ మహేష్ శేఖర్, రాజ శేఖర్, నేతాజీ, కిరణ్ మని, టైలర్ వేణు, పసుపులేటి గిరి, తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఆవరణలో చేనేత వస్త్ర దుకాణం

**– యూనిట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు**



**గాయత్రి వార్తలు,ఏలూరు జిల్లా ఇంచార్జ్,బి.ప్రభాకర్**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర దుకాణ యూనిట్ ప్రారంభోత్సవంలో పలువురు ఎమ్మెల్యేలతోపాటు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కూడా పాల్గొన్నారు.అసెంబ్లీ ప్రాంగణంలో చేనేత కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు చేనేత వస్త్ర దుకాణ యూనిట్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ చేనేత రంగం మన సంప్రదాయం, సంస్కృతి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభమని తెలిపారు. చేనేత కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు రావాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వారికి ఆర్థిక భరోసా కల్పిస్తాయని అన్నారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా కళాకారుల జీవనోపాధి మెరుగుపడటమే కాకుండా, మన సాంప్రదాయ వృత్తులు సజీవంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు స్వయంగా చేనేత వస్త్రాలను వినియోగించి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అసెంబ్లీ ఆవరణలో ఇలాంటి దుకాణాల ఏర్పాటు ద్వారా ప్రజల్లో చేనేతపై మరింత అవగాహన పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# రబీ పంట నమోదు పరిశీలన



**పెదకూరపాడు ఫిబ్రవరి 19 గాయత్రి వార్తలు,**

మండలంలోని తాళ్లూరు గ్రామంలో రబీ 2025 లో సాగుచేసి పంట నమోదు చేయబడిన రైతుల జాబితా క్షేత్రస్థాయిలో బోయపాటి రవిబాబు సహాయ వ్యవసాయ సంచాలకులు సత్తెనపల్లి వారు తనిఖీ చేసి నారు. క్షేత్రస్థాయిలో రబీ లో ఇంకా ఏమైనా పంటలు నమోదు జరగకపోయిన యెడలగ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించి 23.02. 2026 లోగా ఇ పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు సంక్షేమ పథకాలు కొరకు ప్రతి రైతు కు రైతు విశిష్ట సంఖ్య అవసరం కావున విశిష్ట సంఖ్య నమోదు కొరకు మిగిలి పోయిన రైతులు పట్టాదారు పాస్ బుక్ కాపీ, ఆధార్, ఆధార్ అనుసంధానిత మొబైల్ నంబరు తో రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి క్రిష్ణయ్య, గ్రామ ఉద్యాన సహాయకులు పవన్ కళ్యాణ్ పాలుగోన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ఘన నివాళి- రాజగోపాల్

**విజయవాడ ఫిబ్రవరి 19 గాయత్రి వార్తలు,**



జగ్గయ్యపేట చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలోని హిందూ చైతన్య వేదిక జగ్గయ్యపేట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు.ఈ సందర్భంగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి హిందూ చైతన్య వేదిక సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ స్వరాజ్య స్థాపకుడు చత్రపతి శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, పరిపాలనా నైపుణ్యం ప్రతి ఒక్కరికి ఆదర్శమని పేర్కొన్నారు. యువత ఆయన స్ఫూర్తిని తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నూకల కుమార్ రాజా, వెంగళరావు, సంకా వెంకట్రావు, సంకా భాస్కరరావు, అల్లీ రవిచంద్, షేక్ ఇజాజ్, పున్నా ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బల్వంత్ రాయ్ మెహతా 127వ జయంతి ఘనంగా నిర్వహణ

**– పంచాయతీరాజ్ మూడో ప్రభుత్వ స్థాపనకు సంకల్పం నేతల పిలుపు**





**గాయత్రి వార్తలు,**

తాడేపల్లి: దేశ పంచాయతీరాజ్ పితామహుడు, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) వ్యవస్థాపక అధ్యక్షుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అమరశహీద్ బల్వంత్ రాయ్ మెహతా 127వ జయంతి వేడుకలు తాడేపల్లి రివర్ వ్యూ అపార్ట్మెంట్ వద్ద ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు బల్వంత్ రాయ్ మెహతా చిత్రపటానికి పూలమాలలతో పుష్పాంజలి ఘటించారు.

**73వ, 74వ రాజ్యాంగ సవరణల ప్రస్తావన**

ఈ సందర్భంగా డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ, అఖిల భారత పంచాయతీ పరిషత్ నిరంతర పోరాటాల ఫలితంగా మరియు అప్పటి బల్వంత్ రాయ్ మెహతా పంచాయతీ రాజ్ సంస్థాన్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎల్.ఎం. సింఘ్వీ ఆధ్వర్యంలో ఏర్పాటైన రాజ్యాంగ సవరణ కమిషన్ సిఫార్సుల మేరకు భారత ప్రభుత్వం 73వ మరియు 74వ రాజ్యాంగ సవరణల ద్వారా త్రిస్థాయి పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించిందని తెలిపారు.అయితే, రాజ్యాంగంలోని 29 అంశాలకు సంబంధించిన అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో గ్రామీణ స్వయంప్రతిపత్తి సంస్థలకు బదిలీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**పంచాయతీరాజ్ ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు బలమైన పునాది**

***– దేశవ్యాప్తంగా ప్రస్తుతం***

***– 2,48,160 గ్రామ పంచాయతీలు***

***– 6,284 బ్లాక్ పంచాయతీలు***

***– 695 జిల్లా పంచాయతీలు***

మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థల నుంచి ఎన్నికైన 31 లక్షల మంది ప్రజాప్రతినిధులు, అందులో 14,39,000 మహిళా ప్రతినిధులు ఉన్నారని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు, గ్రామస్థాయిలో పాలన బలోపేతానికి బల్వంత్ రాయ్ మెహతా విశేష కృషి చేశారని కొనియాడారు.

1955–57 మధ్య లోక్‌సభ అంచనాల కమిటీ ఛైర్మన్‌గా ఆయన సేవలందించారని గుర్తుచేశారు.

**– అమరత్వం దేశ సేవలో మహనీయుడు**

1965 ఇండో–పాక్ యుద్ధ సమయంలో మెహతా ప్రయాణిస్తున్న విమానం పాకిస్తాన్ వైమానిక దళం కాల్పులకు గురై ప్రమాదవశాత్తూ కూలిపోయిందని, దేశ సేవలో ఆయన అమరుడయ్యారని పేర్కొన్నారు.

**– మూడో ప్రభుత్వ స్థాపనకు సంకల్పం**

పంచాయతీరాజ్‌ను మూడో ప్రభుత్వంగా పూర్తి స్థాయిలో అమలు చేయడానికి దేశవ్యాప్తంగా పోరాటం కొనసాగించాలని, అఖిల భారత పంచాయతీ పరిషత్ యొక్క గైర్ రాజకీయ, గైర్ దళీయ స్వరూపాన్ని కాపాడుతూ పంచాయతీల సాధికారత కోసం నిరంతర కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

"గ్రామ స్వరాజ్యం బలోపేతమే దేశాభివృద్ధికి పునాది" అని వారు స్పష్టం చేశారు.

# గ్రామపంచాయతీలకు శుభవార్త: 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి ప్రభుత్వం స్పష్టమైన అనుమతి

**అమరావతి, ఫిబ్రవరి 18, 2026:గాయత్రి వార్తలు,**

రాష్ట్రంలోని గ్రామపంచాయతీలకు ఊరట కలిగించే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మెమో నెం.3093506/PR/1/2026-PTS-I ద్వారా 15వ ఆర్థిక సంఘం నిధులను ఇప్పటికే అమలు చేసి, కొలిచిన పనులకు వినియోగించుకోవడానికి స్పష్టమైన అనుమతి మంజూరు చేసింది.2026 జనవరి 5న రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభల తీర్మానాలు, ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెమోలో పేర్కొన్నారు. పనులు సక్రమంగా అమలు చేసి, మెజర్‌మెంట్ బుక్స్‌లో నమోదు చేసినట్లయితే, ఆ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు చేపట్టవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది.పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ నివేదికల ఆధారంగా ఈ అనుమతి ఇవ్వబడింది. మూడు స్థాయిల పంచాయతీ రాజ్ సంస్థలకు జారీ చేసిన మార్గదర్శకాలకితోడు, ఇప్పటికే పూర్తైన పనులకు నిధుల వినియోగంపై ఉన్న అనుమానాలకు ఈ ఉత్తర్వులు చెక్ పెట్టాయి.విజయవాడలోని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయంతో గ్రామపంచాయతీలలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు వేగవంతం కానున్నాయి.గ్రామాల అభివృద్ధి, పారిశుధ్య మెరుగుదల, స్థానిక సంస్థల ఆర్థిక స్థిరత్వానికి ఇది దోహదం చేస్తుందని అధికారులు






అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలో 15 వ ఆర్థిక సంఘం నిధులు చేసిన పనులకు బిల్లులు పెట్టుకునే విధంగా ఆంక్షలు సడలించినందుకు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ మైలవరపు వీఆర్, అదనపు కమిషనర్ ఎం సుధాకర్ రావు, ముఖ్య గణాంక అధికారి జీ వీరాంజనేయులు కు ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ , ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి తరిమెల కృష్ణమోహన్, సర్పంచులు ధన్యవాదాలు తెలిపారు

# తెలుగుదేశం పార్టీ కి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలి: తూనుగుంట్ల సాయిబాబా.

**బాపట్ల ఫిబ్రవరి 19 గాయత్రి వార్తలు,**

అభివృద్ధి,సంక్షేమం దిశగా రాష్ట్రంలోనే తెలుగుదేశం ప్రభుత్వం పని చేస్తున్నదని అటువంటి పార్టీకి మనమంతా అంకిత భావంతో పనిచేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. మండల కేంద్రమైన భట్టిప్రోలు లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆవరణలో పార్టీ సీనియర్ కార్యకర్త కె వెంకటేశ్వరరావు అధ్యక్షతన భట్టిప్రోలు తెలుగుదేశం పార్టీ నాయకుల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికిముఖ్యఅతిథిగా పాల్గొన్న సాయిబాబా మాట్లాడుతూ 2024లో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టిన నాటినుండి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా నాయకత్వం పనిచేస్తుందన్నారు. మాజీ మంత్రి వేమూరు శాసనసభ్యులు నక్క ఆనందబాబు ఆధ్వర్యంలో భట్టిప్రోలు లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.గత వైసిపి ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేక పోయిందన్నారు. గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న రోడ్లకు సిసి రోడ్లు నిర్మాణం చేపట్టడం జరుగుతున్నదని, అన్నా క్యాంటీన్ రూ 60 లక్షలతో ఏర్పాటు జరిగే ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నదన్నారు. ప్రారంభోత్సవం అయిన నాటినుండి గ్రామములోని పేద లేక చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భట్టిప్రోలు కి పనులపై వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు.అదేవిధంగా రూ 25 కోట్లతో బౌద్ధ స్తూపం మరియు ప్రక్కన ఉన్న చెరువును అభివృద్ధిపరిచి బుద్ధ విగ్రహాన్ని లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ సహకారం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో జరిగే అభివృద్ధిని కొంతమంది చూడలేక ఈర్ష్యతో అక్కస్సు వెళ్ళబోసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.కడచిన ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వం కాలంలో గ్రామంలో ఏమి అభివృద్ధి చేశారో నిన్న మొన్న అక్కసు వెళ్ళబోసుకుంటున్న వారు తెలియపరచాలని సాయిబాబా పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరమునర కాలంలో ఏ ఏ అభివృద్ధి పనులు జరిగాయి నేను



ప్రజల ముందు ఉంచుతానని సాయిబాబా తెలిపారు. ప్రజలకు నిత్యం అవసరమై ఉన్న రక్షత తాగునీటి సరఫరా పథకం డ్యామేజీ అయిన నేపథ్యంలో వెంటనే పనులు చేసేందుకు కార్యదర్శి పనులు చేపడితే దానిని విమర్శించటం సిగ్గుచేటు అన్నారు. పైపు డ్యామేజ్ అయిన అనంతరం సభ్యులందరినో పిలిచి సమావేశం ఏర్పాటు చేసి అనంతరమే రిపేరు చేయాలనడం సమంజసం కాదన్నారు. అప్పటివరకు ఈ గ్రామంలో సరఫరా నిలిచిపోవడం సరైన పద్ధతి అని ఆయన ప్రశ్నించారు.ఎమ్మెల్యే ఆనందబాబు సహకారంతో రానున్న పంచాయతీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరఫున నిజాయితీ అయిన వ్యక్తులతో ప్యానల్ ఏర్పాటు చేసి ఎన్నికలలో పోటీ చేయటం జరుగుతుందని సాయిబాబా పేర్కొన్నారు. నిజాయితీపరులైన వ్యక్తులకు గ్రామాభివృద్ధికి తోడ్పడే వ్యక్తులకు గ్రామ ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో మండల మాజీ వైస్ ఎంపీపీ యడ్ల జయశీలరావు, సాగునీటి సంగం ఉపాధ్యక్షుడు డొక్కు శ్రీనివాసరావు,రైతు నాయకులు డొక్కు పెద్ద శ్రీనివాసరావు, కంభం సుధీర్,సువ్వ బాబురావు,అదిన బసవ పున్నయ్య, కొలుసు శేషగిరి రావు, యార్లగడ్డ పాండురంగారావు, పొనుగుపాటి పున్నారావు, ఉల్లంగుంట వెంకటేశ్వరరావు, బెల్లంకొండ రవి, హసన్ బెగ్,చల్లా నాగరాజు,అద్దంకి శివాని,మంద్రు సునీల్ అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

***GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,*** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.